క్లుప్తంగా

షిరిడీసాయి సంస్థాన్‌లో అన్నదానం



అన్నప్రసాద వితరణ

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని షిరిడీసాయి సంస్థాన్‌లో గురువారం అన్నదానం ప్రారంభించారు. ఇకపై ప్రతి గురువారం అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు స్వామివారికి అర్చకులు సంతోష్ బ్రహ్మ ఆధ్వర్యంలో మూడు హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' పేదలకు వరం



చీడిపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జి.సిగడాం: వాండ్రంగి, చీడిపేట గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జి.సిగడాం వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. మంచాలకు పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా వాహనాలు డ్రైవ్ చేయాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి వాహనచోదకుడు రహదారిపై బండి నడిపేటప్పుడు కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని బాధ్యతతో డ్రైవ్ చేయాలని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల సమీపంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలువురు వాహనచోదకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. త్రిబుల్ రైడ్ చేయకూడదని, మైనర్లకు బళ్లు ఇవ్వరాదని, ఇన్సూరెన్సు తదితర ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ నేరమని, హెల్మెట్ విధిగా ధరించాలని సూచించారు.

26న చంద్రబాబు రాక

శ్రీకాకుళం: ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఈ నెల 26న శ్రీకాకుళం రానున్నారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు నుంచి ఆరు గంటల వరకు టీడీపీ శ్రేణులతో నగరంలోని 80 ఫీట్ రోడ్డులో జరగనున్న రా..కదలిరా.. బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: యోగాసనాల ద్వారా ప్రతిఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి తెలిపారు. కళాశాలలో గురువారం యోగా, హార్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు విద్యార్థినులతో యోగాసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, యోగా మాస్టారు పి.మురళీకృష్ణ, కొఠారి రేణుక, కె.నాగలక్ష్మి, టూరిజం మెంబర్ నటుకుల మోహన్, సర్వీసుల శాఖ మేనేజర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

షిరిడీసాయికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బాబా

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న ఏపీ హెచ్‌బీ కాలనీలో షిరిడీ సాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీనివాస శర్మ, కిరణ్‌శర్మల నేతృత్వంలో స్వామికి క్షీరాభిషేకాలు చేశారు. అఖండ భజన అనంతరం శేజ్ హారతి ఇచ్చారు.

సచివాలయాలతో సుపరిపాలన

- భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



సతివాడలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన సచివాలయాలతో మంచి పరిపాలన అందించామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం అంపోలు–3 రామకృష్ణాపురం గ్రామంలోని నూతన సచివాలయ భవనం, ఆర్బీకే భవనం, సతివాడ నూతన సచివాలయ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ పాలన ఉందన్నారు. మండల స్థాయి నుంచి గ్రామస్థాయికి పరిపాలన తీసుకువచ్చి అనేక సేవలను అందిస్తూనే క్షేత్రస్థాయిలో ప్రజలకు అనేక పనులను సులువుగా చేయడం సచివాలయాల వల్లే సాధ్యమయ్యిందన్నారు. భూ సర్వే కారణంగా గ్రామాల్లో వివాదాలు తగ్గాయని చెప్పారు. సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వావలంబన సాధించి పౌరుల్లో ఆత్మగౌరవం పెరిగిందన్నారు. తలెత్తుకొని జీవించగలమన్న ధైర్యం సామాన్యుల్లో వచ్చిందని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలో మనసులో మంచి పరిపాలన ఇవ్వగలమ్మన్న నమ్మకం ఉందని, అందుకే మంచి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వంశధార ప్రాజెక్టు పూర్తి కావస్తోందని, రానున్న కాలంలో ఏడాదిలో మూడు పంటలకు సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కృష్ణ, గోదావరి జిల్లాల మాదిరిగా మన నేల కూడా సస్యశ్యామలం కానుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘురాం, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పీస గోపి, సర్పంచ్‌లు గొండు జయరామ్, యాళ్ల నారాయణమూర్తి, ఎంపీటీసీలు ముద్దాడ గోవిందరావు, పాదిలాపు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలంలోని కొత్తకోటలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లుట్ల అమ్మాజమ్మ, వైఎస్సార్‌సీపీ రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చాంద్ బాష, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు జగ్గురోతు తవిటినాయుడు, రాష్ట్ర అర్బన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, అధికారులు, స్థానిక సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, ఉప సర్పంచ్ లక్ష్మణరావు, అదపాక సర్పంచ్ గొర్లె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు నేతృత్వంలో 40వ డివిజన్ హయాతీనగరంలోని 45 కుటుంబాల వారు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ యువనేత పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు సారథ్యంలో హయాతీనగరంలో ప్రజానీకానికి సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.21 కోట్ల 52 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అవ్వాతాతలకు ఒకటో తేదీనే పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు, లోకేష్ మోసపూరిత మాటలను నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాధు వైకుంఠరావు, చీమల తారక్, ఎ.అప్పన్న, టి.కామేశ్వరి, సీపాన రామారావు, కె.తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సీట్లను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యా హక్కు చట్టం–2009 సెక్షన్ 12 (1)సి ప్రకారం 2024–25 విద్యా సంవత్సరానికి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పిల్లలు (అనాధలు, హెచ్‌ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభా వంతులు) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు సమీప ప్రాంతంలో అన్ని ప్రవేటు. అన్ ఎయిడెడ్ స్కూళ్లలో 1వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ జిల్లా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐబీ/బీసీఎస్ఈ/ఐసీఎస్ఈ/స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో సదరు వర్గాలకు చెందిన పిల్లలు 25 శాతం సీట్లను ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల ఆధార్ ద్వారా ప్రాథమిక వివరాలతో సీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్ లోరిజిస్టర్ చేసుకోవాలన్నారు. సచివాలయం, మండల విద్యావనరుల కేంద్రం/సంబంధిత పాఠశాల నుంచి కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్: 1800 425 8599ను సంప్రదించాలన్నారు.

పెన్‌కాక్ సిలాట్ పోటీలో పతకాల పంట



క్రీడాకారులు, కోచ్‌తో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక ఆలిండియా పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పూర్తి హవా కనబర్చారు. మహారాష్ట్రంలోని నాందేడ్‌లో గురుగోవింద్ సింగ్ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 18 నుంచి 20 వరకు జాతీయస్థాయి బాలబాలికల పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించిన శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. మూడు రజత, రెండు కాంస్య పతకాలు సాధించి శభాష్ అనిపించారు. జూనియర్ విభాగం 70–75 కేజీల కేటగిరిలో ఎం.పవన్‌సాయి, సబ్ జూనియర్ విభాగం 42–45 కేజీల కేటగిరిలో పి.నికేష్‌నాయుడు, 36–39 కేజీల కేటగిరిలో పొన్నాడ శ్రీకర్ రజత పతకాలు సాధించారు. 30–33 కేజీల కేటగిరిలో అంధవరపు, 42–45 కేజీల కేటగిరిలో నేతింటి చెరిష్మా కాంస్య పతకాలు సాధించారు. ఇటీవలి కేరళలో జరిగిన జాతీయ సౌత్‌జోన్ పోటీల్లో పతకాలు సాధించడంతో వీరంతా నేరుగా జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. వీరితోపాటు పెన్‌కాక్ సిలాట్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడులను జిల్లా అధ్యక్షుడు, గ్రాండ్ మాస్టర్ రేగిడి దయామయా, ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణ్‌నాయుడు, లింగాల ఈశ్వరరావు గురువారం అభినందించారు.

జాబ్ మేళాలో 28 మందికి ఉద్యోగాలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, కృష్ణపట్నం సెక్యూరిటీ సర్వీసెస్, విశాఖపట్నం పేటీఎం సంయుక్తంగా గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 28 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 62 మంది హాజరు కాగా చివరగా 28 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కంపెనీల ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, జేకేసీ కోఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కాశీబుగ్గ: పలాస డివిజన్‌ని కార్మిక శాఖ పరిధిలో ఉన్న దుకాణాలు, సంస్థల యజమానులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ ఎల్లాజీరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా మీ–సేవా, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామ స్పష్టం చేశారు.

సేవలకు సత్కారం



పాతశ్రీకాకుళం 29, 31 వార్డు సచివాలయంలో సత్కారం పొందిన వలంటీర్లతో నాయకులు



చాపురం–2 సచివాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు, సిబ్బంది



శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి సచివాలయంలో..



సానావీధి సచివాలయంలో..



మండలవీధి సచివాలయ వలంటీర్లతో పద్మావతి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడంలో గ్రామ, వార్డు వలంటీర్లు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులు పొందిన వలంటీర్లకు సచివాలయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు గురువారం సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

వలంటీర్ల సేవలు అభినందనీయం



రణస్థలం: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ గ్రామ వలంటీర్లు సకాలంలో అందజేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎచ్చెర్ల, రణస్థలం మండలాలకు చెందిన వలంటీర్లను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో వలంటీర్లు తమ ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. కష్ట కాలంలో ఉత్తమ సేవలు అందించి దేశవ్యాప్తంగా పేరుప్రఖ్యాతలు సంపాదించారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ కష్టపడి పని చేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలు, నవరత్నాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, రణస్థలం, ఎచ్చెర్ల ఎంపీడీఓలు ఆర్.విరమణమూర్తి, రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

జి.సిగడాం: బాతువ గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు బూటు దమయంతి, పీఏసీఎస్ చైర్మన్ పల్లేడ సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బూటు అప్పారావు, బూటు హరి, బెవర పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: జై జగన్ నినాదాలు చేస్తున్న వలంటీర్లు, పార్టీ శ్రేణులు



జి.సిగడాం: వలంటీర్లను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వర్సిటీలో అక్రమాలపై ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్లలోని బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నెలకొన్న అవినీతి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతూ దళిత సంఘాల నేతలు గురువారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. పాలక మండలి అనుమతి లేకుండా, నోటిఫికేషన్ విడుదల చేయకుండా, సిఫారసులతో నియామకాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడం లేదన్నారు. తక్షణమే అక్రమాలు అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా దళిత సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు ఎడ్ల జానకిరావు, రాకోటి రాంబాబు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ



నివాళులర్పిస్తున్న డీవైఈవో, స్కూల్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం అలవడుతుందని శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి పేర్కొన్నారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ స్టీఫెన్‌సన్, బెడెన్ పావెల్ జయంతి సందర్భంగా ప్రపంచ ఆలోచన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ ఆలోచన దినోత్సవం నినాదం పర్యావరణం, ప్రపంచ పేదరికం కోసమని వివరించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.వాగ్దేవి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పి.రమాకుమారి, డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, చార్టర్ అకౌంటెంట్ పి.వైకుంఠరావు, స్కౌట్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ జి.బుజ్జిబాబు, పీడీ ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

'లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు'



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. 'మహిళలపై పనిచేసే ప్రదేశాల్లో వేధింపుల నిరోధక చట్టం –2013'పైన ఆయన గురువారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో మెప్మాలోని రిసోర్స్ పర్సన్లకు శ్రీకాకుళం హెడ్ క్వార్టర్స్ సచివాలయంలోని మహిళా సిబ్బందికి అవగాహన కల్పించారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరిగితే కఠినమైన చర్యలు ఉంటాయని, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ తరచుగా సమావేశమై ఈ కేసులను విచారిస్తుందని, మహిళలు ఎవరూ భయపడకుండా ప్రతి డిపార్టుమెంట్‌లో నెలకొల్పిన ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీకి తమ ఫిర్యాదులు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్, శ్రీకాకుళం ఎంపీడీఓ సతీష్, సచివాలయంలోని మహిళా సిబ్బంది న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.